


## మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 184 ఉద్యోగుల్లో దరఖాస్తులు ఆహ్వానం

02లో




# సంగారెడ్డి మెదక్


గురువారం13 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:10


## మెదక్ జిల్లా వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా గాంతి అశోక్...



**మనోహరాబాద్: ఆగస్టు12( ప్రజా జ్యోతి )**

మెదక్ జిల్లా వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా బుధవారం,ఎన్నికైన మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామానికి చెందిన ఆరో వార్డు సభ్యుడు గాంతి అశోక్, పరికిబండ, గౌతోజీగూడెం, పోతారం గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంతి అశోక్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పరికిబండ గ్రామానికి గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌతోజీగూడెం సర్పంచ్ నాగరాజు,ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్ట.మహేందర్, మంచ.శ్రీరామ్, యెషం. భగవాన్, నిమ్మల.యాదగిరి కర్కాల.సత్యనారాయణ రెడ్డి, నిమ్మల.శ్రీశైలం, బొల్లాబోయిన.నర్సింలు, చింతల.ఆనంద్, గోనెగరి.నవీన్ గౌడ్, గండి.మహేష్, తూముకుంట.శ్రీశైలం, గాంతి. క్రాంతికుమార్, సాలిపేట.నాగరాజు, సురేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.




## అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

- పొలంబడి కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ అధికారుల అవగాహన

2 లో

## మంత్రి వివేక్ వెంకటస్వామి ఏడుపాయల విచ్చేయడం జరిగింది

**మెదక్ (ప్రజాజ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత దర్శించుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మంత్రి ఆలయానికి చేరుకున్న సందర్భంగా ఆలయ అర్చకులు సిబ్బంది ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు అనంతరం మంత్రి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం అర్చకులు మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు ఈ సందర్భంగా ఆలయ పరిసరాలోని భక్తులు పొందుతున్న సౌకర్యాలను మంత్రి పరిశీలించినట్లు తెలిపారు ఏడుపాయలు వనదుర్గ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.



# అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

మొదటిపేజీ తరువాయి

**రాయికోడ్ ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సోయాబీన్‌కంది అంతర పంటల సాగుపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు.నూనెగింజల పంటలు,అపరాల పంటల ప్రాముఖ్యతతో పాటు వాటి సాగు విధానాలు,అంతర పంటల సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.పంటల మధ్య అంతర పంటలను సాగు చేయడం ద్వారా నేల సారాన్ని పరిరక్షించడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.మెరుగైన దిగుబడుల కోసం రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని,నాణ్యమైన విత్తనాలను వినియోగించడంతో పాటు సమతుల్య ఎరువుల వాడకం,సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులను అవలంబించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి సారిక,వ్యవసాయ విస్తరణ అధికారి దీపిక,ఆత్మ సిబ్బంది రమేష్,గ్రామ సర్పంచ్ శ్రీమతి ఉర్మిళ శ్రీనివాస్ రెడ్డితో పాటు కర్చల్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బీమాతో కుటుంబాలకు ధీమా

## - ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ మారుతిరావు

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:**




జీవిత బీమా పాలసీలు కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తాయని ఎల్ఐసీ జహీరాబాద్ శాఖ సీనియర్ మేనేజర్ మారుతిరావు అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని ఎల్ఐసీ శాఖ కార్యాలయంలో ఏజెంట్లు, అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..దేశంలో 23 బీమా సంస్థలు ఉన్నప్పటికీ ఎల్ఐసీ ప్రథమ స్థానంలో కొనసాగడానికి పాలసీదారుల్లో సంస్థపై ఉన్న విశ్వాసమే ప్రధాన కారణమని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఏజెంట్లు కూడా తమ విధానాలను మార్చుకోవాలని, ఆధునిక బీమా పథకాలపై అవగాహన పెంచుకుని వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎల్ఐసీ అందిస్తున్న వివిధ జీవిత బీమా పథకాలు, వాటి ప్రయోజనాలను ఏజెంట్లు, సిబ్బందికి వివరించారు. ప్రజల్లో బీమాపై మరింత అవగాహన కల్పిస్తూ, కుటుంబాల ఆర్థిక భద్రతకు బీమా ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ శాఖ మేనేజర్ లతీఫోద్దీన్, డెవలప్‌మెంట్ అధికారులు నరేందర్‌రెడ్డి, రాజు, శ్రావణ్‌కుమార్, రత్నయ్య, ఏజెంట్ల సంఘం అధ్యక్షులు విఠల్‌గౌడ్, వెంకటేశం, దిగంబర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**అందోల్, ఆగస్టు 12 (ప్రజాజ్యోతి):**

అందోల్‌జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో చేయూత పింఛన్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితర అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



అర్హులైన వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత అర్హతను నిర్ధారించే అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా జత చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు ఆగస్టు 31, 2026 చివరి తేదీ అని స్పష్టం చేశారు. అర్హత ఉన్న వారు గడువులోగా దరఖాస్తులు సమర్పించి చేయూత పింఛన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తొలగించిన రేషన్ కార్డు పునరుద్ధరించాలి

## - బీఎస్పీ అధ్యక్షుడు అనుముల తుకారాం డిమాండ్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:**



నారాయణఖేడ్ మండల పరిధిలోని హనుమంతరావుపేట్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ బద్దారం ఎంకమ్మ రేషన్ కార్డు తొలగించడంతో ఆమె కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వెంటనే రేషన్ కార్డును పునరుద్ధరించాలని బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షుడు అనుముల తుకారాం డిమాండ్ చేశారు. అర్హత ఉన్న తొలగించిన నిరుపేద కుటుంబం రేషన్ కార్డును వెంటనే పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని బుధవారం తహశీల్దార్ ను కోరారు.దీనిపై స్పందించిన తహశీల్దార్ మూడు రోజుల్లో రేషన్ కార్డు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తుకారాం మాట్లాడుతూ..అర్హులైన నిరుపేదల రేషన్ కార్డులను తొలగించడం అన్యాయమని, పేదల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్ధూ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 184 ఉద్యోగుల్లో దరఖాస్తులు ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

**మెదక్ (ప్రజా జ్యోతి)**

ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ సీనియర్ రెసిడెంట్ తో పాటు 150 అవుట్సోర్సింగ్ పోస్టులు మెదక్ ప్రభుత్వం మెడికల్ కాలేజీలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగ భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ నితిన్ కాబ్రా తెలిపారు కాంట్రాక్టు విధానంలో నాలుగు ప్రొఫెసర్లు ఐదు అసోసియేట్ ప్రొఫెసర్లు ఆరు సీనియర్ రెసిడెంట్లు పోస్టులను అర్హులకు అభ్యర్థులను దరఖాస్తులు కోరుతున్నారు. ఈ పోస్టుకు సంబంధించి దరఖాస్తు ఆగస్టు 12 నుండి 14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో స్వీకరించనున్నట్లు తెలిపారు అదేవిధంగా మెడికల్ కాలేజీలో పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదినా ఔట్సోర్సింగ్ విధానంలో వివిధ కేటగిరీలో చెందిన 156 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రి బాత్రూంలో మృత శిశువు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో కలకలం రేపిన ఘటన చోటుచేసుకుంది.ఈ నెల ఆగస్టు 7వ తేదీన, అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆసుపత్రిలోని బాత్రూంలో వదిలి వెళ్లారు.బాత్రూంలో మృత శిశువు ఉన్న విషయాన్ని గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.అయితే మృత శిశువును ఆసుపత్రి బాత్రూంలోకి ఎవరు తీసుకొచ్చారు? ఏ పరిస్థితుల్లో అక్కడ వదిలి వెళ్లారు? అనే అంశాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.అంతేకాకుండా ఈ ఘటనలో ఆసుపత్రి సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా? అన్న కోణంలో కూడా పోలీసులు, వైద్య అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది.ఆసుపత్రిలోని సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తూ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.మృత శిశువును ఎవరు వదిలి వెళ్లారన్నది ప్రస్తుతం మిస్టరీగా మారింది. పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు వెలుగులోకి రావాల్సి ఉంది.






## మెదక్ జిల్లా వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా గాంతి అశోక్...

మనోహరాబాద్: ఆగస్టు12( ప్రజా జ్యోతి )



మెదక్ జిల్లా వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా బుధవారం, ఎన్నికైన మనోహరాబాద్ మండలం పరికిబండ గ్రామానికి చెందిన ఆరో వార్డు సభ్యుడు గాంతి అశోక్, పరికిబండ, గౌతోజీగూడెం, పోతారం గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంతి అశోక్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పరికిబండ గ్రామానికి గర్వకారణమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌతోజీగూడెం సర్పంచ్ నాగరాజు,ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్ట.మహేందర్, మంచ.శ్రీరామ్, యెషం. భగవాన్, నిమ్మల.యాదగిరి కర్నాల.సత్యనారాయణ రెడ్డి, నిమ్మల.శ్రీశైలం, బొల్లాబోయిన.నర్సింలు, చింతల.ఆనంద్, గోనెగరి.నవీన్ గౌడ్, గండి.మహేష్, తూముకుంట.శ్రీశైలం, గాంతి. క్రాంతికుమార్, సాలిపేట.నాగరాజు, సురేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని

గౌరవ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి +. నీలిమ గారి సూచనల మేరకు రోజున మెదక్ పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో "అంతర్జాతీయ యువజన దినోత్సవం" పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్యానల్ లాయర్ శ్రీ బాల నరసింహులు మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని, వారి ఆలోచనలు, ప్రతిభ, శక్తి దేశ అభివృద్ధికి ఎంతో అవసరం అన్నారు. యువత విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని, మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని, సమాజం మరియు దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు అన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ మహమ్మద్ యూసుఫ్ అలీ , ఐటిఐ ఏటిఓ శ్రీ రవి భరత్ , ప్లాన్ ఇండియా ఎన్జీవో ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ వెంకటేశ్వర్లు , గంగాధర్ గౌడ్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# శ్రీ గురు పీఠంలో మళ్లీ దొంగల హల్‌చల్



శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 12:

శివ్వంపేట మండలం గూడూరు గ్రామ శివారులో గల శ్రీ గురు పీఠంలో తెల్లవారుజామున 3 గంటలకు తాళాలు పగలగొట్టి హుండీల అపహరణ నగదు చోరీ,శ్రీ గురు పీఠంలో మరోసారి దొంగలు హల్‌చల్ చేశారు. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు తాళాలు పగలగొట్టి హుండీలను ఎత్తుకెళ్లారు. అనంతరం హుండీలను పగలగొట్టి అందులోని నగదును అపహరించి,ఖాళీ హుండీలను సమీపంలోని చెట్టు కింద పడవేసి పరారయ్యారు.దొంగల కదలికలు ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి.ఘటనపై ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించగా,పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.ఈ ఘటనతో భక్తులు,స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన

### - ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్ పదవులకు ఎన్నికలు,,

శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 12:



విద్యార్థుల్లో చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించే ఉద్దేశంతో శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాలలో బుధవారం విద్యార్థుల మండలి ఎన్నికలు నిర్వహించారు.'ఎలక్షన్స్ ఫర్ స్టూడెంట్స్ కౌన్సిల్' కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్ పదవులకు విద్యార్థులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు.ఓటు హక్కు వినియోగం,ఎన్నికల నిర్వహణ,నాయకత్వ బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్,ఉపాధ్యాయులు శ్రీహర్ష,శ్రీనివాస్,సమీ,రాజు,భారతి తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## సబ్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

## అనంతసాగర్ హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్ అశోక్..

కొండాపూర్ ప్రజా జ్యోతి




మండలం అనంతసాగర్ గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్‌ను తహసీల్దార్ అశోక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు.సబ్ సెంటర్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలను నిరంతరం కొనసాగించాలని సూచించారు.అనంతరం సబ్ సెంటర్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీ సందర్భంగా సంబంధిత సిబ్బంది తహసీల్దార్ అశోక్‌కు వివరాలు అందించారు.

# పీఆర్సీ, పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి

## - యూఎస్‌పీసీ బాధ్యులు వరగంటి సంతోష్‌కుమార్,

శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 12:



పీఆర్సీ ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను (కరువు భత్యం) వెంటనే మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్‌పీసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు చేపట్టిన దశలవారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం శివ్వంపేట మండల కేంద్రంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ బాధ్యులు వరగంటి సంతోష్‌కుమార్, శ్రీనివాస్, నారాయణ్ గౌడ్ మాట్లాడుతూ పీఆర్సీ నివేదికను తెప్పించుకుని వెంటనే పీఆర్సీని ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను మంజూరు చేయడంతో పాటు కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు శ్రీనివాస్, టీపీటీఎఫ్ నాయకులు శ్రీనివాస్, సింహం, యూటీఎఫ్ నాయకులు చక్రసింగ్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, లక్ష్మణ్‌తో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు సమత, విజయశ్రీ, అనిత, మాధవి, మానస, శ్రీలత, ఈశ్వర్‌ప్రసాద్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన టైర్ వర్క్‌షాప్స్ అసోసియేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

జహీరాబాద్, ఆగస్టు 12(ప్రజా జ్యోతి న్యూస్)





జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామ పరిధిలో గల రాజ్ మహల్ ఫంక్షన్ హాల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జహీరాబాద్ టైర్ వర్క్‌షాప్స్ అసోసియేషన్‌ను ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, మాజి డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజి మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్ ,హోతి బి గ్రామ సర్పంచ్ మచ్చేందర్, కౌన్సిలర్ లు అబ్దుల్లా, యాకూబ్, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు అసోసియేషన్ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. టైర్ వర్క్‌షాప్ యజమానులు, కార్మికుల సమస్యలను సమష్టిగా పరిష్క రించుకునేందుకు అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. టైర్ వర్క్‌షాప్స్ రంగం అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తా నని ఎమ్మెల్యే మాణిక్ రావు హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా పనిచేస్తూ తమ రంగాన్ని మరింత అభివృద్ధి చేసుకో వాలని ఆకాంక్షించారు.

# లక్ష్మారెడ్డి 27వ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 12:



స్వర్గీయ శ్రీ వాకిటి లక్ష్మారెడ్డి 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 15న రక్తదాన శిబిరంతో పాటు విద్యా వికాస్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నర్సాపూర్‌లోని వెల్దుర్తి రోడ్డులో గల సాయి కృష్ణ గార్డెన్‌లో ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వర్గీయ శ్రీ వాకిటి లక్ష్మారెడ్డి అభిమానులు, శ్రేయోభిలాషులు, యువకులు, మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా విద్యా వికాస్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొని స్వర్గీయ శ్రీ లక్ష్మారెడ్డి స్మృతిని ఘనంగా చాటాలని శివ్వంపేట మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎం.డి. లాయక్ ఈ సందర్భంగా కోరారు,

# శ్రీ గురు పీఠానికి 'తత్వమసి' వేద సంహిత గ్రంథాలు

శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 12:



హిమాలయ సంత్ పరమహంస శ్రీ వేదానంద సరస్వతి స్వామీజీ వారు రచించిన వేద సంహిత 'తత్వమసి' గ్రంథాలు శ్రీ గురు పీఠం దేవాలయానికి చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గురు పీఠం ట్రస్ట్ చైర్మన్, ఫౌండర్ శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ,, నిరంతరం ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందాలనే ఆసక్తి కలిగిన భక్తులు గురువారం ఈ గ్రంథాలను స్వీకరించవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ గ్రంథాలను అందరికీ పంపిణీ చేయడం లేదని, ఆధ్యాత్మిక పరిజ్ఞానం, ఆసక్తి కలిగిన వారే గ్రంథ స్వీకరణకు అర్హులని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక సాధనలో ఆసక్తి ఉన్న భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ గురు పీఠం నిర్వాహకులు సూచించారు.



# రేషన్ డీలర్లతో తహసీల్దార్ అశోక్ సమావేశం

కొండాపూర్ ప్రజా జ్యోతి

తహసీల్దార్ కార్యాలయంలో ఫెయిర్ ప్రైస్ షాప్ (రేషన్ షాప్) డీలర్లతో తహసీల్దార్ అశోక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నెలల ప్రత్యేక పంపిణీ కార్యక్రమంపై డీలర్లకు పలు సూచనలు చేశారు. మూడు నెలలకు సంబంధించిన ప్రత్యేక రేషన్ సరుకుల పంపిణీని లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా చేపట్టాలని సూచించారు. రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రేషన్ షాపుల్లో స్టాక్, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీలర్లకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రత్యేక పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ అశోక్ తెలిపారు.

# సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణీ మృతి

# బంధువుల తీవ్ర ఆందోళన, ఉద్రిక్తత

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు గర్భిణీ ప్రాణాలు కోల్పోయిందంటూ మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధ్యులైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన 33 సంవత్సరాల అనిత అనే తొమ్మిది నెలల గర్భిణీని ప్రసవం కోసం ఈ నెల 10వ తేదీన కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. గత మూడు రోజులుగా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్న ఆమెకు, బుధవారం ఉదయం 5 గంటల సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి మృతి చెందిందని వైద్యులు తెలిపారు.ఆసుపత్రిలో బాగానే ఉన్న అనిత అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఉదయాన్నే ఆసుపత్రికి చేరుకున్న బంధువులు ఆవరణలో ఆందోళన చేపట్టారు. గత మూడు రోజులుగా డెలివరీ చేయకుండా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించడం వల్లే అనిత ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. మూడు రోజులుగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా ఏ విధంగా చనిపోతుందని ప్రశ్నిస్తూ ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనకు బాధ్యులైన సంబంధిత డాక్టర్లు, వైద్యాధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేశారు. బంధువుల ఆందోళనతో ఆసుపత్రి ఆవరణలో కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సంగారెడ్డి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితులను అదుపులోకి తెచ్చే



ప్రయత్నం చేశారు.

---

# ఎక్సైజ్ ఉత్తర్వులకు విరుద్ధంగా బార్ యాజమాన్యాలు ?

- అధిక సంపాదనే లక్ష్యంగా నిబంధనలకు తూట్లు.
- తూతూమంత్రంగా తనిఖీలు..
- ఆధారాలతో ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా:
- సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్

**జహీరాబాద్, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి న్యూస్)**


రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఎక్సైజ్ పాలసీ, శాఖ నిర్దేశించిన నిబంధన లకు విరుద్ధంగా జహీరాబాద్ పట్టణంలోని కొన్ని బార్ యాజమాన్యాలు వ్యవహ రిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సితార రెస్టారెంట్ అండ్ బార్కు సంబంధించి నిబంధనల ఉల్లంఘన జరుగుతోందంటూ సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్ ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. బార్‌లకు కేటాయించిన మద్యం స్టాక్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు తరలించడం, అనధికారిక విక్రయ కేంద్రాలకు మద్యం చేరడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. ఈ వ్యవహారానికి సంబంధించి తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**పత్రికల్లో వార్తలు వస్తేనే తనిఖీలేనా ?**

బార్‌లలో నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదు లు వచ్చినప్పుడు ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా, పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సంతోష్ కుమార్ పేర్కొన్నారు. అయితే కొన్ని సందర్భా ల్లో పత్రికల్లో వార్తలు ప్రచురితమైన తర్వాత మాత్రమే హడావుడిగా తనిఖీలు నిర్వహించి, ఆ తర్వాత విషయాన్ని వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయని అన్నారు. ఈ అంశంపై స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డిని పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేం దుకు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదని సంతోష్ కుమార్ తెలిపారు.

**" ప్రభుత్వ ఆదాయం కంటే నిబంధనలు ముఖ్యం "**

సామాజిక కార్యకర్త పబ్బతి సంతోష్ కుమార్ మాట్లాడుతూ: "ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని రూపొందించింది అంటే దాని వెనుక ప్రజా ప్రయోజనం, ప్రభుత్వ ఆదాయం, అక్రమ మద్యం నియంత్రణ వంటి అనేక అంశాలు ఉంటాయి. లైసెన్స్ పొందిన ప్రతి బార్ యాజమాన్యం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆధారాలు బయటకు వస్తే అధికారులు వాటిని నిర్లక్ష్యం చేయకుండా పారదర్శకంగా విచారణ జరపాలి. ఒక బార్‌కు



సంబంధించిన మద్యం బాటిల్ అనధికారిక విక్రయ కేంద్రంలో కనిపించడం సాధారణ విషయం కాదు. ఆ బాటిల్ అక్కడికి ఎలా చేరింది ? ఎవరు సరఫరా చేశారు ? బార్ స్టాక్ రికార్డుల్లో ఏముంది ? అనే విషయాలను అధికారులు శాస్త్రీయంగా, రికార్డుల ఆధారంగా తేల్చాలి.

ఎవరినీ ముందుగానే దోషులుగా నిర్ధారించడం మా ఉద్దేశం కాదు. కానీ తప్పు జరిగితే చర్యలు తీసుకోవడం, తప్పు జరగకపోతే వాస్తవాలను ప్రజలకు తెలియ జేయడం అధికారుల బాధ్యత. ఈ వ్యవహా రంపై స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధి కారులు కూడా దృష్టి సారించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరుతున్నాను. అవసర మైతే ఈ ఫిర్యాదును రాష్ట్రస్థాయి ఉన్నతాధి కారుల దృష్టికి కూడా తీసుకెళ్తాను" అని తెలిపారు. బుధవారం జహీరాబాద్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సితార బార్‌పై విచారణ చేసి, నిబంధనల ఉల్లంఘన ఉంటే చట్టపర మైన చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వ కంగా ఫిర్యాదు చేసినట్లు సంతోష్ కుమార్ తెలిపారు. ఫిర్యాదుపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలా స్పందిస్తారు ? సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

# సత్వార్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



- ఏడుగురు వ్యవసాయ కూలీల దుర్మరణం
- ట్యాంకర్ ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు - ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

**జహీరాబాద్, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి న్యూస్)**

జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామం వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. వ్యవసాయ కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను ట్యాంకర్ ఢీకొనడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన తో జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు, అత్యవసర సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో క్షతగాత్రుల కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకోవడంతో అక్కడ విషాదకర పరిస్థితి నెలకొంది.

### క్షతగాత్రులను పరామర్శించిన చైర్మన్



ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ వెంటనే స్పందించారు. కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలిసి జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని వైద్య సిబ్బందిని కోరారు. అవసరమైతే మెరుగైన వైద్య సదుపాయాలు ఉన్న ఆసుపత్రులకు క్షతగాత్రులను తరలించి చికిత్స అందించాలని సూచించారు. బాధితు లకు వైద్యం, మందులు తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు.

### మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ప్రాగాడ సానుభూతి తెలిపారు. రోజువారి కూలి పనులపై ఆధారపడి జీవించే కుటుంబా ల్లో విషాదం నెలకొనడం అత్యంత బాధాకర మని పేర్కొన్నారు.


### ఈ ఘటన తీవ్రంగా కలచివేసింది

సత్వార్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్రంగా కలిసి వేసింది. ఎంతోమంది కుటుంబాలకు ఆధారంగా ఉన్న వ్యవసాయ కూలీలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు నా ప్రాగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారికి మెరుగైనవైద్యం అందించి, వారు త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదా లు జరగకుండా రహదారి భద్రత చర్యలను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందిని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ పేర్కొన్నారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ, మున్సిపాల్ కమీషనర్, డీస్పీ, ఆర్డీఓ, ఏమర్వో, డిఎంఎచ్వో, ఏరియా ఆసుపత్రి సూపరడెంట్, సీఐ, ఎసై, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొని క్షతగాత్రుల పరిస్థితిని తెలుసుకున్నారు.

---

# అమావాస్య సందర్భంగా వీరభద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు





**రాయికోడ్ ఆగస్టు 12 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న సీఐ హనుమంతుకు ఆలయ నిర్వాహకులు,అర్చకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం,అర్చనలు,పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.అమావాస్య సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీరభద్రేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా కనిపించింది.ఈ సందర్భంగా సీఐ హనుమంతు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి.

# సత్వార్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదంపై ఎంపీ సురేష్ షెట్కర్ దిగ్భ్రాంతి

## -బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులకు సూచన

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:



జహీరాబాద్ నియోజకవర్గంలోని సత్వార్ గ్రామం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నందున ప్రమాద స్థలానికి వెంటనే చేరుకోలేకపోయిన ఎంపీ, చరవాణి ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రమాదంలో పలువురు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల్లో కొందరు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాకు చెందిన వారు ఉండటం మరింత విషాదకరమని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు అవసరమైన సహాయం అందించడంలో అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు.

# పామాయిల్ సాగుతో అధిక దిగుబడులు, ఆదాయం వ్యవసాయ శాస్త్రవేత్త కాశీ రావు

కల్హేర్:12.ఆగస్టు. ప్రజా జ్యోతి.

పామాయిల్ తోటల సాగుతో రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం లభించే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్త కాశీరావు తెలిపారు.కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పామాయిల్ తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పామాయిల్ సాగు విధానం, తోటల నిర్వహణ, దిగుబడులపై రైతులతో చర్చించారు. వరి సాగుకు బదులుగా పామాయిల్ తోటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.పామాయిల్ సాగుతో దీర్ఘకాలికంగా మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని, శాస్త్రీయ పద్ధతుల్లో తోటలను నిర్వహించాలని కాశీరావు రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈశ్వర్రెడ్డి, క్షేత్ర సిబ్బంది హర్షిత, మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అమలు చేయాలి

## - ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:



జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను తప్పనిసరిగా అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో అనేక మంది ఉపాధ్యాయులు తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగిన వేతనం అందడం లేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక, సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సంబంధిత నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోగుల రాష్ట్ర బీమా, ఉద్యోగుల భవిష్యనిధి సౌకర్యాలు కల్పించాలని, వేతనాలను బ్యాంకు ఖాతాల ద్వారా పారదర్శకంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కనీస వేతనాలు అమలు చేయని పాఠశాలల్లో విద్యాశాఖ, కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, సోయల్ తదితరులు పాల్గొన్నారు.

# 161-బి జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలి

## -కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ సురేష్ షెట్కార్ రిమైండర్ లేఖ




నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:

తెలంగాణ సరిహద్దు నుంచి బీదర్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న జాతీయ రహదారి 161(బి) అభివృద్ధిలో భాగంగా నారాయణఖేడ్ పట్టణ పరిధిలో మిగిలిపోయిన రహదారి విస్తరణ పనులను వెంటనే మంజూరు చేసి వేగవంతం చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి మరోసారి రిమైండర్ లేఖ రాశారు.గతంలో తాను సమర్పించిన వినతిపై సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనను పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించినందుకు కేంద్ర మంత్రికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. నారాయణఖేడ్ పట్టణంలో రహదారి విస్తరణ పూర్తికాకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను లేఖలో వివరించారు.

పట్టణ పరిధిలో ఇరుకైన రహదారి : నిజాంపేట్నారాయణఖేడ్బీదర్ రహదారికి ఇరువైపులా విస్తరణ పనులు జరుగుతున్నప్పటికీ, నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని 4.50 కిలోమీటర్ నుంచి 8.00 కిలోమీటర్ వరకు ఉన్న సుమారు 3.50 కిలోమీటర్ల రహదారి భాగాన్ని ప్రస్తుత ప్రాజెక్టులో చేర్చలేదని తెలిపారు. దీంతో పట్టణంలో నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు : ఇరుకైన రహదారి, సరైన మురుగునీటి కాలువల వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల భద్రత దృష్ట్యా రహదారి విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : మిగిలిపోయిన రహదారి భాగాన్ని కూడా ప్రస్తుత ప్రాజెక్టులో చేర్చి విస్తరణ పనులు చేపట్టడంతో పాటు మధ్యలో విద్యుత్ దీపాల ఏర్పాటు, ఆధునిక మురుగునీటి కాలువల వ్యవస్థను నిర్మించాలని ఎంపీ కోరారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రవాణా మరింత సులభతరం అవుతుందని తెలిపారు.నారాయణఖేడ్ ప్రాంత ప్రజల సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి విస్తరణకు సంబంధించిన సాంకేతిక పరిశీలనను త్వరితగతిన పూర్తి చేసి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎంపీ సురేష్ షెట్కార్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని లేఖ ద్వారా కోరారు.

# బీబీపేట్‌లో రంగుమారిన కలుషిత నీరు



## - మిషన్ భగీరథ, నల్లాల ద్వారా కలుషిత నీటి సరఫరా

## - అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

**కల్హేర్ , ఆగస్టు 12:. ప్రజా జ్యోతి**

సంగారెడ్డి జిల్లా లోని కల్హే ర్ మండల పరిధిలోని బీబీపేట్ గ్రామంలో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ, నల్లాల ద్వారా రంగుమారిన తాగునీరు సరఫరా అవుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా స్వచ్ఛంగా ఉండాల్సిన తాగునీరు రంగు మారి, కలుషితంగా కనిపిస్తుండటంతో దాన్ని తాగేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఇళ్లకు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించిన గ్రామస్తులు నీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య కారణంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారిపై ఆరోగ్యపరమైన ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటిని వినియోగించడం వల్ల జీర్ణకోశ సంబంధిత సమస్యలు, ఇతర అనారోగ్యాలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

**వెంటనే నీటి పరీక్షలు చేయాలని డిమాండ్**

నీరు రంగు మారడానికి గల కారణాలను అధికారులు గుర్తించి, సరఫరా వ్యవస్థను పూర్తిగా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించాలని, ఫలితాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

అలాగే తాగునీటి పైపులైన్లు, ట్యాంకులు, సరఫరా మార్గాలను తనిఖీ చేసి సమస్య ఎక్కడ ఏర్పడిందో గుర్తించాలని కోరుతున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజలకు ప్రత్యామ్నాయంగా శుద్ధమైన తాగునీటిని అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపు**

గ్రామంలో తాగునీటి సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని బీబీపేట్ గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి, కలుషిత నీటి సరఫరాకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు."స్వచ్ఛమైన తాగునీరు అందించడం అధికారుల బాధ్యత. రంగుమారిన నీటిని తాగి అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి రాకముందే అధికారులు చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్తులు కోరుతున్నారు.

---

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ - ఎస్పీ, అడిషనల్ ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్






**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: ఆగస్టు 12:-**

సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సీఎం రూట్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ప్రాంతాల్లో భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15న సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్న సీఎం

## - ఏర్పాట్లపై జగ్గారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సమీక్ష




నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15న సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బుధవారం అధికారులతో, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్, వేదిక ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు మరింత మెరుగైన, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..

# పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## -ఖేడ్ తహసీల్దార్ కార్యాలయం ముందు ఉపాధ్యాయ సంఘాల నిరసన

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:

పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చంద్ర మోహన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో దశ పోరాటంలో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు జ్ఞాన మంజరి, అశోక్, బాబురావు, కాశీనాథ్ జాదవ్, సీహెచ్ విఠల్ మాట్లాడుతూ.. పాఠశాలలు, ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వెంటనే వేతన సవరణ సంఘం నివేదికను ప్రకటించి 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పింఛనుదారులకు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.2003 ఉపాధ్యాయ నియామక పరీక్ష ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని వర్తింపజేయాలని, కొత్త పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రతి పాఠశాలకు అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాలని, అశాస్త్రీయమైన ప్రభుత్వ ఉత్తర్వు 25ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, పట్టణ నివాస పాఠశాలలు, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, గురుకులాలన్నింటినీ ఒకే సంచాలకత్వ పరిధిలోకి



తీసుకురావాలని కోరారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు 010 ఖాతా అమలు చేయాలని, 2016 వేసవిలో మధ్యాహ్న భోజన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని అన్నారు. 2002 ఉపాధ్యాయ నియామక పరీక్షలో శిక్షణ లేని ఉపాధ్యాయుల కొత్త పింఛను విధానపు మినహాయింపులను జిల్లా పంచాయతీ భవిష్యనిధి ఖాతాలకు బదిలీ చేయాలని, స్థానికత కోల్పోయిన 317 ప్రభుత్వ ఉత్తర్వు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలిగించే బోధనేతర పనులను తగ్గించాలని, విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులను బోధన నుంచి దూరం చేయరాదని, విద్యాశాఖలో స్వచ్ఛంద సంస్థల జోక్యాన్ని నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో భారీ ధర్నాలు, ఆగస్టు 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నరేష్ స్వామి, హరి సింగ్, గోవింద్, ఏసుదాస్, జావిద్, మహేష్ కుమార్, దీపక్ కుమార్, కిష్టయ్య, పరుశురాం, సంగయ్య, అయాజ్, నందు, సిద్దయ్య స్వామి, రవి కుమార్, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, గాలప్ప, శ్రీనివాస్, శశికళ, అనిత, రాధిక, శోభ, వజ్రవ్వ, వీరలక్ష్మి, రమాదేవి, నాగరాణి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# తోగర్పల్లి గ్రామ అభివృద్ధికి పరిశ్రమ చేయూత..! - సీసీ డ్రైనేజీ నిర్మాణంపై హర్షం..

కొండాపూర్ ప్రజా జ్యోతి



తోగర్ పల్లి గ్రామ ప్రధాన రహదారి పక్కన ప్రజల సౌకర్యార్థం సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం. ఓ ప్రైవేట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఈ డ్రైనేజీ నిర్మాణం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వర్షాకాలంలో మురుగు నీరు, వర్షపు నీరు రహదారిపై నిలిచిపోకుండా ప్రజలకు కొంత మేరకు ఉపశమనం కలిగే అవకాశం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఈ సీసీ డ్రైనేజీ నిర్మాణం గ్రామపంచాయతీ నిధులతో జరుగుతోందా.. ప్రైవేట్ పరిశ్రమ స్వచ్ఛందంగా నిర్మిస్తుందా.. సీ ఎ స్ఆర్ నిధుల ద్వారా చేపడుతున్నారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు, పరిశ్రమ యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.ఏది ఏమైనా ప్రజల సౌకర్యం కోసం ప్రైవేట్ పరిశ్రమ ముందుకు వచ్చి మౌలిక వసతుల కల్పనకు చేయూతనివ్వడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు గ్రామాలను దత్తత తీసుకుని రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే ఇలాంటి కార్యక్రమాలకు పారదర్శకతతో పాటు నిధుల వివరాలను ప్రజలకు తెలియజేస్తే మరింత విశ్వాసం పెరుగుతుందని గ్రామస్తులు అభిప్రాయ పడుతున్నారు.

# ఆసరా పెన్షన్లకు అర్హులు పత్రాలు సిద్ధం చేసుకోవాలి

## - 7వ వార్డు కౌన్సిలర్ విజయ్ బుజ్జి

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:



తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా, చేయూత సామాజిక భద్రతా పెన్షన్లకు అర్హులైన వారు కొత్త పెన్షన్ దరఖాస్తుల కోసం అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని నారాయణఖేడ్ మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ విజయ్ బుజ్జి అన్నారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు సంబంధించిన పెన్షన్ వర్గాల్లో అర్హత కలిగిన వారు తమ పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు.వితంతు పెన్షన్‌కు ఆధార్ కార్డు, భర్త మరణ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా కుటుంబ వివరాలు, బ్యాంకు ఖాతా లేదా పాస్‌బుక్, ఫోటో అవసరమని తెలిపారు. ఒంటరి మహిళల పెన్షన్‌కు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫోటోతో పాటు భర్త నుంచి విడిపోయి కనీసం ఏడాది అయినట్లు ధృవీకరణ లేదా అవివాహిత మహిళలకు వయస్సు ఆధారం అవసరమని పేర్కొన్నారు. దివ్యాంగుల పెన్షన్‌కు ఆధార్ కార్డు, దివ్యాంగత్వ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫోటో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.గీత కార్మికుల పెన్షన్‌కు ఆధార్ కార్డు, గీత కార్మికుల సహకార సంఘం సభ్యత్వ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫోటో అవసరమని తెలిపారు.చేనేత కార్మికుల పెన్షన్‌కు ఆధార్ కార్డు, చేనేత కార్మికుల సంఘం సభ్యత్వ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫోటో అవసరమని పేర్కొన్నారు.అర్హులు తమ పెన్షన్ వర్గానికి సంబంధించిన ప్రత్యేక ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు వివరాలు, ఫోటోలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. వయస్సు నిర్ధారణకు ఆధార్, జనన ధృవీకరణ పత్రం, ఓటరు జాబితా వంటి ఆధారాలు అవసరమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

# 22 ఏళ్ల దేశ సేవకు ఘన సత్కారం

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:



దేశం కోసం 22 ఏళ్ల పాటు సైన్యంలో సేవలందించిన కంగ్టి మండలం జంగి తండాకు చెందిన జవాన్ వడిత్య రవీందర్‌కు స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది. రిటైర్మెంట్ అనంతరం గ్రామానికి చేరుకున్న ఆయనను సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు పూలమాలలతో సన్మానించి ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. 22 ఏళ్ల పాటు దేశానికి సేవ చేయడం తన అదృష్టమని, స్వగ్రామస్తులు ఇంత ప్రేమతో, గౌరవంతో స్వాగతించడం ఎంతో ఆనందంగా ఉందని భావోద్వేగం వ్యక్తం చేశారు. ఆయన సేవలు యువతకు ఆదర్శమని గ్రామస్తులు కొనియాడారు.

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

## - రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 12:

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ ప్రాంతీయ కార్యాలయ స్థలంలో ఎస్టీఎఫ్‌ఐ జెండాను సీనియర్ నాయకులు పంచాక్షరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఎస్టీఎఫ్‌ఐ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక హక్కుగా చూడాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటం అవసరమని ఆయన అన్నారు. కొత్త పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని, జాతీయ విద్యా విధానం2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరి, జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శులు ఏషప్ప, నరేష్ స్వామి, నర్సయ్యతో పాటు నారాయణఖేడ్, నిజాంపేట్, మనూర్, నాగల్‌గిద్ద, కంగ్టి, సిర్గాపూర్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏసుదాస్, శ్రీరామ్ నాయక్, రవీందర్, దేవిసింగ్, జ్యోతిలింగం, రాములు, నర్సింలు, అంజయ్య, శివకుమార్ ముఖ్య నాయకులు గంగామోహన్, శాంరావు, రాందాస్, అయాజ్ అలీ, సిద్ధయ్య స్వామి, దత్తాత్రి, రాములు, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకాలకు స్వస్తి పలకాలి తెలంగాణ రక్షణ సేన నేత

## – నెమలికొండ వేణుమాధవ్ ధ్వజం

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :



సంగారెడ్డి జిల్లా రాజకీయాలపై తెలంగాణ రక్షణ సేన నేతలు విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు డ్రామాలు మానుకోవాలని ఆ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి నెమలికొండ వేణుమాధవ్ సూచించారు. పూర్తి వివరాలు మా ప్రతినిధి అందించే ఈ కథనంలో చూద్దాం...సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు నాటకాలకు స్వస్తి పలకాలని తెలంగాణ రక్షణ సేన జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి నెమలికొండ వేణుమాధవ్ హెచ్చరించారు. మంగళవారం తన నివాసంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్టీ సెల్ నాయకుడు శంకర్ నాయక్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత మూడు దశాబ్దాలుగా సంగారెడ్డి, సదాశివపేట ప్రాంతాల్లో అధికారంలో ఉన్న నాయకులు ప్రజా సమస్యలను పక్కనబెట్టి, కేవలం సొంత ఆస్తులను పెంచుకోవడంపైనే దృష్టి పెట్టారని వేణుమాధవ్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ భూముల కబ్జాలు, అధికార దుర్వినియోగం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. పోతిరెడ్డిపల్లిలో బస్టాండ్, సదాశివపేటలో సబ్ కోర్టు లాంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రాపర్ యూ-టర్న్, హైమాస్ట్ లైట్లు, సర్వీస్ రోడ్లు లేక వందలాది మంది ప్రాణాలు కోల్పోతుంటే, ఏళ్ల తరబడి టోల్ టాక్స్ మాత్రం వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే సంగారెడ్డి జిల్లాలోని రోడ్డు ప్రమాదాలపై అత్యవసర సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా 'మంజీరా జలాల'పై స్పష్టమైన ప్రకటన చేయాలని వేణుమాధవ్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలకు తాగునీరు అందించకుండా ఆ నీటిని హైదరాబాద్‌కు తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీంతోపాటు సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, సదాశివపేట మున్సిపాలిటీల్లో శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డులు, వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. వర్షాకాలంలో డంపింగ్ యార్డుల వ్యర్థాలు మంజీరా నదిలో కలవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కవిత గారి నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన ప్రజల తరపున నిలబడి పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శంకర్ నాయక్, బసవరాజ్, నర్సింలు, యశ్వంత్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# గడి 13వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

## - అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

జహీరాబాద్ ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి న్యూస్)



జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గడి 13వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు వార్డులో మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదు పాయాల కల్పనకు మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగి పోవడంతో పాటు వర్షాకాలంలో ఏర్పడే బురద, గుంతల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది అన్నారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జహీరాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో 13వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో రహదారి సమస్య పరిష్కారం కానుండటంపై చైర్మన్ మొహమ్మద్ యూనుస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అతిక్ హక్కని, మున్సిపల్ ఏఈ వెంకటేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.